క్లుప్తంగా

ఘనంగా నవదుర్గమ్మ గ్రామోత్సవం



కడియంలో నవదుర్గ అమ్మవారి ఊరేగింపు

కడియం: దసరా ఉత్సవాల్లో భాగంగా కడియం మేకలదిబ్బ సెంటర్‌లో నిర్వహించిన నవదుర్గమ్మ ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి కమిటీ ఆధ్వర్యంలో భారీ బాణసంచా కాల్పులు, తీన్మార్ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రసాదం, అమ్మవారి కుంకుమ పంపిణీ చేశారు.

దసరా ఉత్సవాల్లో సేవలకు సత్కారం



సత్కారం అందుకుంటున్న కళాశాల విద్యార్థులు

కంబాలచెరువు: దేవీచౌక్‌లో జరిగిన 92వ శరన్నవరాత్ర ఉత్సవాల్లో విశేష సేవలందించిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగాన్ని శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బత్తుల రాజరాజేశ్వరరావు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు అందించిన స్వచ్ఛంద సేవలకు ప్రశంసలు లభించాయన్నారు. 16 ఏళ్లుగా ఈ ఉత్సవాల్లో ఆదిత్య కళాశాల తన సేవలను అందిస్తోందన్నారు. అలాగే ఎన్‌ఎస్‌ఎస్ సేవలను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సుగుణా రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణి కుమార్ అభినందించారు.

ఆటోడ్రైవర్లకు నమూనా చెక్కు అందజేత

రాజమహేంద్రవరం రూరల్: ఆటోడ్రైవర్ సేవలో పథకంలో భాగంగా నియోజకవర్గంలో మూడువేలమంది ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. స్థానిక మున్సిపల్ స్టేడియంలో శనివారం జరిగిన ఆటో డ్రైవర్ల సేవలో, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

కడియం: ఆటోడ్రైవర్ సేవలో పథకం ప్రారంభోత్సవం సందర్భంగా కడియంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో మెట్ట పంటలకు మేలు



రంగంపేటలో సాగు చేస్తున్న మిరప చేను

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం ఒక్కసారిగా మారిపోయింది. సుమారు గంటకు పైగా వర్షం కురిసింది. ఏడీబీ రోడ్డులో ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులు వర్షం కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోయారు. ఈ వర్షం మండలంలోని వరి, మినుము పంటలకు ఎంతో మేలు చేస్తుందని, అలాగే ఉద్యాన పంటలైన మొక్కజొన్న, బొప్పాయి, జామ, మిరప, ఆయిల్ పామ్ పంటలతో పాటు కూరగాయలు, ఆకుకూరల పంటలకు ఎంతో ఉపయోగమని రైతులు తెలిపారు.

స్వచ్ఛతలో మెరిసి.. అవార్డుతో మురిసి..

- శాటిలైట్ సిటీ జెడ్పీ హైస్కూల్‌కు గౌరవం
- స్వచ్ఛ పాఠశాలల విభాగంలో పురస్కారానికి ఎంపిక

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అరుదైన గౌరవం దక్కింది. ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సమష్టిగా పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషికి గుర్తింపుగా స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర 2025 అవార్డు లభించింది. స్వచ్ఛ పాఠశాలల విభాగంలో జిల్లా స్థాయిలో అవార్డు రావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమాలు, ఆట స్థలాలు, తోటల సంరక్షణకు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కృషి చేశారు. అందరి సహకారంతో పాఠశాలకు అవార్డు దక్కింది.

ప్రత్యేక వసతులు

పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక వసతులు ఉంటాయి. స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు, పరిశుభ్రమైన వాష్‌రూమ్‌లు, హ్యాండ్‌వాష్‌లు ఉన్నాయి. విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకంగా హ్యాండ్‌వాష్ పాయింట్లు ఏర్పాటు చేశారు.

నందనవనం

శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందనవనాన్ని తలపిస్తోంది. పచ్చని తోటలు, పండ్ల మొక్కలతో ఆహ్లాదకరంగా ఉంటోంది. పరిశుభ్రమైన తరగతి గదులు, తాగునీటి వసతి, ప్లాస్టిక్ రహిత ప్రాంగణం.. రాష్ట్ర విద్యాశాఖా బృందాన్ని ఆకట్టుకుంటున్నాయి. దీంతో జిల్లా స్థాయి గౌరవం దక్కింది.



శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

అవగాహన ర్యాలీలు

పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, నీటి వినియోగం, ఓజోన్ పొరను కాపాడే విషయంలో విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. వాటిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలకు అవార్డు రావడానికి ఇవి కూడా ప్రధాన కారణం.

అరుదైన మొక్కలు

పాఠశాలలో ఔషధ గుణాలు కలిగిన మారేడు, లెమన్ గ్రాస్, నాగమల్లి, అరికేపం, రాయల్‌పాతో పాటు పలు ఆకుకూరలు, కూరగాయలు, పూల మొక్కలను పెంచుతున్నారు. పాఠశాల మొత్తం పచ్చదనంతో ఉండే విధంగా మొక్కలను విద్యార్థులు సంరక్షిస్తున్నారు.

సంతోషంగా ఉంది



స్వచ్ఛ పాఠశాలల పురస్కారానికి జిల్లాలో మూడు స్కూళ్లు ఎంపికయ్యాయి. వాటిలో శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉండడం సంతోషంగా ఉంది. ఇది మా పాఠశాల సాధించిన ఘనత. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, సర్వశిక్షా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సహకారం మరువలేనిది.

– నున్న ప్రశాంతి, శాటిలైట్ సిటీ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు



పచ్చని ఆవరణలో గౌతమ బుద్ధుని విగ్రహం



కూరగాయల మొక్కలను సంరక్షిస్తున్న విద్యార్థినులు (ఫైల్)



పాఠశాల ఆవరణలో గోంగూర మొక్కలు

మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుకు సన్మానం



రౌతు సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ఎమ్మెల్యే, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావును వైఎస్సార్ సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడిగా నియమించడం ఆనందకరమని ఆ పార్టీ రాజమహేంద్రవరం మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు శనివారం రౌతు సూర్యప్రకాశరావును ఆయన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా రైతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీ కార్యకర్తల వెన్నంటే ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం, వాకచర్ల కృష్ణ, పల్లేడు శంకర్, కొరియర్ ప్రసాద్, రొక్కం త్రినాథ్, వై.సునీల్, గాంధీ, రాంబాబు, సూర్యనారాయణ, రామ్మూర్తి, దేవుడు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటో బోల్తా

- ఎనిమిది మందికి గాయాలు
- ఏలూరు ఆస్పత్రికి తరలింపు

హనుమాన్ జంక్షన్ రూరల్: చెన్నై – కోల్‌కత్తా జాతీయ రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరానికి చెందిన ఓ కుటుంబంలో ఇద్దరు భవానీ మాల ధరించారు. మరో ఆరుగురు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం విజయవాడలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఇద్దరు మాలధారులు దీక్ష విరమించిన అనంతరం ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. బొమ్ములూరు టోల్‌ప్లాజా సమీపంలోని ఫ్లై ఓవర్‌పై వారి ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక్కసారిగా ఆటో పల్టీ కొట్టింది. దానిలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది రోడ్డుపై పడటంతో స్వల్పంగా గాయాలయ్యాయి. వారిని ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ఘటనా స్థలంలో క్షతగాత్రుడు

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

సీతానగరం (రాజానగరం): సీతానగరం మండలం రఘుదేవపురం వద్ద శనివారం సాయంత్రం ఘోర ప్రమాదం తప్పింది. రాజమహేంద్రవరం నుంచి పురుషోత్తపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సు రఘుదేవపురం పెట్రోలు బంకు వద్ద యూటర్న్ తీసుకుంటున్న కారును ఢీకొంది. ఆ సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న 32 మందిలో రఘుదేవపురానికి చెందిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ఢీకొనడంతో కారు రోడ్డు పక్కనే తుప్పల్లో పడింది. అదృష్టవశాత్తూ కారులోని వారికి ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం ధ్వంసమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు.

ఎన్‌ఎస్‌బీ ఉన్నత పాఠశాల పరిశీలన

కంబాలచెరువు: జాంపేటలోని ఎన్‌ఎస్‌బీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ పరిశీలించారు. అక్కడి రికార్డులను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు స్వయంగా బడి భోజనాన్ని వడ్డించారు. దివ్యాంగ విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతి శనివారం పాఠశాలలో అమలు చేస్తున్న నో బ్యాగ్ డే కృత్యాలను పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ప్రతి వారం నిర్వహించే కృత్యాలను భద్రపరచాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సింహాద్రిరావు, ఉపాధ్యాయులు ప్రసాద్, వరహాగిరి కృష్ణమోహన్, రమణారెడ్డి, రాధామణి తదితరులు పాల్గొన్నారు.

- పాఠశాలల్లో ప్రతి శనివారం నిర్వహిస్తున్న నో బ్యాగ్ డే కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతోందని లాలా చెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.విజయలక్ష్మి అన్నారు. నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థుల కృత్యాలను ఆమె పరిశీలించారు. ప్రతి వారం తమ విద్యార్థులకు క్రాఫ్ట్ పేపరుతో బొమ్మలు తయారు చేయడం, పెయింటింగ్స్, విలువల విద్య పుస్తకాల నుంచి ఒక అంశం చదవించి, వివరిస్తున్నట్టు ఉపాధ్యాయిని మోటూరి మంగారాణి తెలిపారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఐ దిలీప్ కుమార్

కాటన్ సంచులతో పర్యావరణ పరిరక్షణ

పెదపూడి: పర్యావరణ పరిరక్షణకు కాటన్ సంచులను వినియోగించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. సంపర గ్రామంలో సంపర ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ర్యాలీ నిర్వహించారు. పాలిథిన్ సంచులు వాడకాన్ని తగ్గించాలని, కాటన్ సంచుల వినియోగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబానికి ఒక కాటన్ సంచి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో మానవాళి మనుగడకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందన్నారు. గ్రామంలో 18 మంది టైలర్ల శ్రమదానంతో 2000 కాటన్ సంచులను తయారు చేసినట్టు తెలిపారు. వాటిని ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్డి వెంకటేశ్వర్లు, ఎంఈఓ -2 సీవీవీ సత్యనారాయణ, టీడీపీ నేత తిబిరిశెట్టి చిన్నారి, లయన్స్ క్లబ్ అడ్మిన్ మండ రాజారెడ్డి, సచివాలయం కార్యదర్శి ఎం.చిన్ని పాల్గొన్నారు.



సంపరలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు, పెద్దలు

జగన్మాతకు నెమలి పింఛాలతో అలంకరణ

రాజానగరం: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు, ఆలయ 33వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చక్రద్వారబంధంలోని దేవీచౌక్‌లో కొలువైన జగన్మాతకు నెమలి పింఛాలతో శనివారం అలంకరణ చేశారు. ఆ గ్రామానికి చెందిన నిడదవోలు కనకాచారి కుటుంబ సభ్యులు నెమలి పింఛాలతో తయారు చేసిన చీరను అమ్మవారికి అలంకరించారు. మకర తోరణం మాదిరిగా వెనుక భాగంలో కూడా రూపొందించారు.



నెమలి పింఛాల చీరతో జగన్మాత, చిత్రంలో కనకాచారి కుటుంబ సభ్యులు

బాలాత్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్న ఏసీబీ కోర్టు జడ్జి



జడ్జి వెంకటేశ్వరరావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈఓ వీర్రాజు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వారిని శనివారం రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వేంకటేశ్వరరావు దర్శించుకొని పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారికి అభిషేకాలు, అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు అందించారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



శాటిలైట్ సిటీలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ గ్రామంలోని మెయిన్ రోడ్డులో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా ఉంది. ఈ దారిలో నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. అంతే కాకుండా మ్యాన్ హోల్ చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల రాత్రి సమయంలో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మ్యాన్ హోల్‌పై గ్రిల్స్ వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

టిప్పర్ల అడ్డగింపు



రాఘవపురంలో టిప్పర్‌ను అడ్డుకున్న స్థానికులు

కోరుకొండ: సీతానగరం మండలం నల్లగొండ, కోరుకొండ మండలం రాఘవపురంలోని కొండలను తవ్వేసి టిప్పర్లలో యథేచ్ఛగా తరలిస్తున్నారు. అతి వేగంగా ఇవి రాకపోకలు సాగిస్తుండడంతో సమీపంలోని గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి టిప్పర్లను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాఘవపురం వాసులు అడ్డుకున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో కొనసాగుతున్న అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లారీల రాకపోకల కారణంగా ఎగురుతున్న దుమ్ముతో వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

బిక్కవోలు: బాణసంచా తయారీ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ అన్నారు. బలభద్రపురం గ్రామంలోని రాజానగరం –రాయవరం రోడ్డులో ఉన్న జానకిరామ గ్రాండ్ ఫైర్ వర్క్స్ తయారీ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాణసంచా తయారీ కేంద్రాలను నిబంధనలు ప్రకారం నిర్వహించాలన్నారు. లేకపోతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ ఉన్నారు.

సినిమాలు



శ్యామల	: కిష్కింధపురి
సూర్యమినీ	: అవతార్, సన్నీ సంస్కారికి తులసీ కుమారి
సూర్యప్యాలెస్	: కాంతారా–1
స్వామి	: ఓజీ
అనుశ్రీ	: ఓజీ
శివజ్యోతి	: ఓజీ
రాజా	: ఓజీ
ఊర్వశి	: కాంతారా–1
మేనక	: ఇడ్లీకొట్టు
రంభ	: మిరాయ్
అప్సర	: కాంతారా–1
అశోక	: ఇడ్లీకొట్టు
నామవరం	
వీఎస్ మహల్	: మిరాయ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కాంతారా–1, ఓజీ
కడియం	
వెంకట సూర్య	: ఓజీ

అధ్వాన వనం

- కళావిహీనంగా కాటన్ పార్కు
- పేరుకుపోయిన చెత్త, చెద పుట్టలు
- ఇబ్బంది పడుతున్న సందర్శకులు, వాకర్లు

ధవళేశ్వరం: ఇరిగేషన్ ఉన్నతాధికారుల కార్యాలయాలకు కూత వేటు దూరంలో ఉన్న ధవళేశ్వరంలోని కాటన్ పార్కు కనీస నిర్వహణ లేక అధ్వానంగా మారింది. నిత్యం సందర్శకులు అధికంగా వచ్చే ఈ పార్కుపై అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో సందర్శకులు, వాకర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాటన్ బ్యారేజీకి దిగువ కాటన్ గెస్ట్ హౌస్ పక్కనే ఉన్న ఈ పార్కు నుంచి బ్యారేజీ, గోదావరి అందాలను వీక్షించవచ్చు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు ఈ పార్కులో గడిపేందుకు ఎక్కువ ఉత్సాహం చూపించేవారు. గ్రామంలోని వందల మంది వాకర్లు ఇక్కడకు ప్రతి రోజూ వాకింగ్ కోసం వస్తుంటారు. ప్రస్తుతం పార్కు పరిస్థితి అధ్వానంగా తయారైంది. పార్కులో టైల్స్ పాడయ్యాయి. విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. పార్కు మొత్తం చెత్తతో నిండిపోయింది. మరో వైపు చెద పుట్టలు సైతం ఏర్పడుతున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగి కళావిహీనంగా మారింది. ప్రకృతి అందాలను తిలకిస్తూ పార్కులో గడపాలని గతంలో అనేక మంది ఈ కాటన్ పార్కుకు వచ్చేవారు. కానీ నేడు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.



నిర్వహణ లేక పార్కులో పేరుకుపోయిన చెత్త



పార్కులో చెద పుట్టలు



పాడైన విద్యుత్ బోర్డులు



పెచ్చులూడి కిందపడుతున్న టైల్స్